క్లుప్తంగా

13న గురుకులాల ప్రవేశ పరీక్ష

అర్ధవీడు(బేస్తవారిపేట): గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు ఈనెల 13వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు అర్ధవీడు అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి.బలరామిరెడ్డి తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని సూచించారు.

ప్లాస్టిక్ కవర్ల తయారీని అడ్డుకోవాలి

గిద్దలూరు రూరల్: ప్లాస్టిక్ కవర్ల తయారీదారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినియోగదారుల సంఘం అధ్యక్షుడు వి.వీరారెడ్డి, కార్యదర్శి టి.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిద్దలూరు నగర పంచాయతీలో దుకాణాలపై కమిషనర్ ఇటీవల దాడులు చేసి ప్లాస్టిక్‌ను నియంత్రిస్తామని చెప్పడాన్ని తప్పుబట్టారు. ప్లాస్టిక్ కవర్లు తయారు చేసే ఫ్యాక్టరీలను మూత వేసేందుకు చర్యలు తీసుకోవాలని, తద్వారా దుకాణాలకు కవర్లు రాకుండా కట్టడి చేయాలని హితవు పలికారు. దుకాణదారులకు జరిమానా విధించడం ద్వారా ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని కట్టడి చేయాలనుకోవడం అవివేకమని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందని స్పష్టం చేశారు.

ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

మార్కాపురం: మండలంలోని మిట్టమీదిపల్లి ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఈనెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ప్రభుత్వం 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించిందని, ఆ రోజు ఈస్టర్ పండగ కావడంతో పరీక్ష తేదీని మరుసటిరోజైన 21వ తేదీకి మార్చిందని వివరించారు. పరీక్ష రాసే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఈనెల 21వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రాయితీలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న కృష్ణారావు

మార్కాపురం టౌన్: మండలంలోని నికరంపల్లిలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు రచ్చబండలో భాగంగా స్థానికులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలు, పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మద్రిపూడి రామకృష్ణ, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, నాగరాజు, చదలవాడ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారాములకు ఏకాంత సేవ



పూజల్లో పాల్గొన్న ఉభయదాతలు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో సీతారామాంజనేయస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గురువారం వేదపండితులు సీతారాములకు ఏకాంత సేవ, పూజలు నిర్వహించారు. మహిళలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఉభయదాతలు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తలు పేర్ల వెంకటసుబ్బారావు, వెంకటరాధాకృష్ణమూర్తి, వెంకటచెన్నయ్య, శ్రీరాములు, భవాని శ్రీనివాసులు, కృష్ణయ్య, రమేష్, సత్యం, కిరణ్ పర్యవేక్షించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఖాశింవలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

రాచర్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాచర్ల మండలంలోని చినగానిపల్లెలో గురువారం వెలుగుచూసింది. వివరాలు.. గ్రామానికి చెందిన జి.ఖాశింవలి(38) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బంధువులు గ్రామ సమీపంలోని మొక్కజొన్న పొలంలో దాడి చేశారని మనస్తాపానికి గురైన ఖాశింవలి బుధవారం రాత్రి 10 గంటల సమయంలో తన ఇంటి ముందు వేప చెట్టుకు ఉరేసుకున్నాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై పి.కోటేశ్వరరావు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఫాతిమాతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

చెత్త.. ప్రకటనలు

కుప్పలు కుప్పలు!

- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రపై పాలకుల ఊకదంపుడు ఉపన్యాసాలు
- ఆచరణలో మాత్రం మీనమేషాలు
- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద కేంద్రాలు
- క్లాప్ మిత్రల నియామకంలో జాప్యం
- గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త నిల్వలు



బేస్తవారిపేటలో చెత్త సేకరిస్తున్న పంచాయతీ కార్మికులు



బేస్తవారిపేటలో ఉప్పువాగు వద్ద డంపింగ్ చేస్తున్న చెత్త

బేస్తవారిపేట:

కూటమి ప్రభుత్వం ఏదో సాధించినట్లుగా ఆర్భాటంగా గొప్పలు చెప్పుకోవడం తప్ప ఆచరణలో పెట్టిన దాఖలాలు లేవు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అంటూ ఇటీవల కాలంలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. భారీ ఫ్లెక్సీలు సైతం ఏర్పాటు చేశారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. గ్రామాల్లో చెత్త నిల్వలు రోజురోజుకూ పేరుకుపోతున్నాయి. ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర పేరుతో ప్రచారం చేస్తూ, చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచిస్తుంటే ఆచరణలో ఎక్కడా అలాంటి ఛాయలు కనిపించడం లేదు. కనీసం డ్రెయినేజీల్లో పూడిక సకాలంలో తీసే పరిస్థితి కూడా లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సంపద సృష్టి ఎప్పుడు..?

నివాసాల్లో చెత్త సేకరించి చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించాలి. అక్కడ వర్మీ కంపోస్టు తయారు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సంకల్పం. సేకరించిన చెత్తను గ్రామానికి దగ్గరలో ఎక్కడ ఖాళీ జాగా కనపడితే అక్కడే డంప్ చేస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో స్థల సమస్యతో గ్రామానికి కొద్ది దూరంలో కేంద్రాలు నిర్మించారు. ట్రాక్టర్లపై తీసుకెళ్లి కేంద్రాల్లో వేసే తీరిక లేకుండాపోయింది. ప్రజలకు ఇబ్బందులు వస్తాయని తెలిసినా కుప్పలు కుప్పలుగా చెత్తను డంప్ చేస్తున్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి వర్మీ కంపోస్టు తయారు చేసి సంపద సృష్టి వైపు అడుగులు పడటం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

క్లాప్ మిత్రలు ఎక్కడ..?

గ్రామాల్లోని ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమం సక్రమంగా అమలు జరిగేందుకు ప్రతి 1000 మంది జనాభా లేదా 250 గృహాలకు ఒక క్లాప్ మిత్రను నియమించారు. ఇలా నియమించిన క్లాప్ మిత్రకు ప్రతి నెలా రూ.6 వేల రూపాయిలను గ్రామ పంచాయతీ నిధుల నుంచి చెల్లించాల్సి ఉంది. క్లాప్ మిత్రలు ప్రతి రోజూ తమకు కేటాయించిన 250 ఇళ్ల నుంచి చెత్త సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించేవారు. కొన్ని పంచాయతీల్లో క్లాప్ మిత్రలను ఏర్పాటు చేసుకున్నారు. ఎక్కువ శాతం పంచాయతీల్లో క్లాప్ మిత్రల ఏర్పాటుపై పెద్దగా ఆసక్తి చూపించలేదు. క్షేత్ర స్థాయిలో వీరి నియామకానికి అవసరమైన చర్యలపై కూటమి ప్రభుత్వం కూడా దృష్టి పెట్టలేదు.

కార్యదర్శులపై తీవ్రమైన ఒత్తిడి

ప్రతి గ్రామంలో 100 శాతం చెత్త సేకరణ చేయించాలని కార్యదర్శులపై తీవ్రమైన ఒత్తిడిని ఉన్నతాధికారుల ద్వారా కూటమి ప్రభుత్వం తీసుకొస్తోంది. గ్రామాల్లో క్లాప్ మిత్రగా చేరడానికి ఎవరూ ముందుకు రావడం లేదని తెలిపినా పట్టించుకునే పరిస్థితి లేదని కార్యదర్శులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. 'మీ ఇంటికి క్లాప్ మిత్రలు వచ్చి చెత్త సేకరిస్తున్నారా.. పారిశుధ్యం ఎలా ఉంది?' తదితర ప్రశ్నలకు ఐవీఆర్ సర్వే ద్వారా ప్రజల నుంచి సమాధానాలు సేకరిస్తున్న ప్రభుత్వం.. పనితీరు బాగోలేదంటూ కార్యదర్శులను హెచ్చరిస్తోంది. ప్రతి రోజూ చెత్త సేకరణ నూరు శాతం చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో క్లాప్ మిత్రలను నియమించకుంటే చెత్తను ఎవరు సేకరించాలని పంచాయతీ కార్యదర్శులు మల్లగుల్లాలు పడుతున్నారు.



అర్ధవీడులో నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం

మార్కాపురం: పౌష్టికాహారంతోనే సరైన ఆరోగ్యం చేకూరుతుందని సీడీపీఓ పి.సుశీలాదేవి పేర్కొన్నారు. మండలంలోని వేములకోటలో గురువారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. వైద్యాధికారి విజయచంద్ర ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్త పరీక్షలు, స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి, అవసరమైన వారికి మందుల అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ ప్రత్యూష, సూపర్‌వైజర్ పి.అరుణకుమారి, ఏఎన్‌ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం 16వ బ్లాక్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక కౌన్సిలర్ డి.హర్షిత మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవికుమార్, ఏఎన్‌ఎం మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక, సంప్రదాయాల సమ్మేళనం పోషణ్ పక్వాడ

కంభం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పోషణ్ పక్వాడ కార్యక్రమం సాంకేతిక, సంప్రదాయాల సమ్మేళనమని స్థానిక ఎంపీడీఓ వీరభద్రచారి పేర్కొన్నారు. పట్టణంలోని సంగా వీధిలో 68వ నంబర్ అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. తీవ్రమైన పోషకాహార లోపం వల్ల శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతాయన్నారు. గర్భిణి దశ నుంచి బిడ్డను ప్రసవించిన రెండేళ్ల వరకు వారి ఆరోగ్య స్థితిని మెరుగుపరిచేందుకు ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సీడీపీఓ నీలోఫర్, సూపర్‌వైజర్ నాగెంచులక్ష్మి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



పెదారికట్లలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పౌష్టికాహారంతో ఆరోగ్యం

కొనకనమిట్ల: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ ఈశ్వరమ్మ, సీడీపీఓ సుధామారుతి పేర్కొన్నారు. గురువారం పెదారికట్ల గ్రామంలో పోషణ్ పక్వాడపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చెంచయ్య, సూపర్‌వైజర్ సరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కంభంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ



వేములకోటలో మాట్లాడుతున్న సీడీపీఓ సుశీలాదేవి, పక్కన డాక్టర్ విజయచంద్ర

కేజీబీవీ ప్రవేశ దరఖాస్తు గడువు నేటితో పూర్తి

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు గడువు శుక్రవారంతో ముగుస్తుందని ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ తెలిపారు. 2025–26 సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ (ఎంపీసీ) ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఆరో తరగతిలో 40, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. వివరాలకు 85007 23716, 8897710857ను సంప్రదించాలని కోరారు.

గిద్దలూరులో భారీ వర్షం



బచ్చలకూరపాడు పొలాల్లో నిలిచిన నీరు

గిద్దలూరు రూరల్: వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా గిద్దలూరు మండలంలోని అంబవరం, కొండపేట, ముండ్లపాడు, పట్టణంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గిద్దలూరు పట్టణంలోని రాజానగర్, నల్లబండ బజారు, శ్రీరామ్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్, అంబవరం ప్రధాన రహదారులు జలమయమయ్యాయి.

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తారు వర్షం కురిసింది. పగలంతా ఎండ వేడిమికి విలవిల్లాడిన ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు. ఈ వర్షంతో పొలాల్లో పచ్చిక పడుతుందని పశుపోషకులు సంతోషం వ్యక్తం చేశారు.

బ్రాహ్మణ సేవా సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కృష్ణప్రసాద్

తర్లుపాడు: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మండల కేంద్రం తర్లుపాడుకు చెందిన వాడెల కృష్ణప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర అధ్యక్షుడు కోసూరు సతీష్‌శర్మ నుంచి నియామకపత్రం అందుకున్నారు. కృష్ణప్రసాద్ ప్రకాశం జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు మేనేజరుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.



కృష్ణప్రసాద్

ఎన్‌డీపీఎస్ యాక్ట్‌పై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉషారాణి

మార్కాపురం టౌన్: ఎన్‌డీపీఎస్(నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) యాక్ట్‌పై మందుల హోల్‌సేల్ డీలర్లు, రిటైలర్లు అప్రమత్తంగా ఉండాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డీవీ ఉషారాణి సూచించారు. గురువారం పట్టణంలోని మెడికల్ అసోషియేషన్ భవనంలో మార్కాపురం డివిజన్ పరిధిలోని మందుల షాపుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నార్కోటిక్ మందుల ఆవశ్యకత, వినియోగం, అమ్మకాలపై అవగాహన కల్పించారు. మందుల కొనుగోలు, అమ్మకాల్లో ఎటువంటి పొరపాట్లు జరిగినా డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ యాక్టు ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.సాయి ప్రణీత్, జిల్లా మాజీ అధ్యక్షుడు యక్కలి బాలు, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కోశాధికారి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నాటుసారా అరికట్టేందుకు సహకరించండి

గిద్దలూరు రూరల్: గిద్దలూరు ప్రాంతంలో నాటుసారా తయారీని అరికట్టేందుకు సహకరించాలని స్థానిక ఎక్సైజ్ సీఐ జయరావు కోరారు. గురువారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో పట్టణంలోని బెల్లం వ్యాపారులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటుసారా తయారీ కోసం బెల్లం కొనుగోలు చేసేవారి సమాచారం అందించాలని సూచించారు. అలాగే బెల్లం విక్రయించే సమయంలో నిబంధనలు పాటించాలని చెప్పారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


- జీసీడీఓ హేమలత



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జీసీడీఓ

కొనకనమిట్ల: పాఠశాలల విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యలో రాణించాలని జీసీడీఓ కె.హేమలత పేర్కొన్నారు. గురువారం మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల్లో సీబీఎస్ఈ విధానానికి దోహదపడే విధంగా సామర్థ్యాలను అంచనా వేసేందుకు ప్రభుత్వం డిజిటల్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులు పరీక్షలు రాసే విధానాన్ని, ట్యాబ్‌ల పనితీరును ప్రిన్సిపాల్ రాఘవ సురేఖతో కలిసి పరిశీలించారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

డాక్టర్ మోహన్‌రెడ్డికి సైకాలజీలో డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మోహన్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: గిద్దలూరుకు చెందిన ప్రముఖ నేత్ర వైద్యుడు జీకే మోహన్‌రెడ్డి ద్రవిడ యూనివర్శిటీ నుంచి సైకాలజీ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. చిత్తూరు జిల్లా కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.దొరస్వామి చేతులమీదుగా ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. శ్రీవెంకటేశ్వర యూనివర్శిటీకి చెందిన సైకాలజీ ప్రొఫెసర్ ఐవీ రమణారెడ్డి పర్యవేక్షణలో 'పర్సనాలిటీ ఫ్యాక్టర్స్ అడ్జస్ట్‌మెంట్ అండ్ లోకస్ ఆఫ్ కంట్రోల్ యమాంగ్ ది విజువల్లీ ఇంపైర్డ్ చిల్డ్రన్' అంశంపై చేసిన పరిశోధనకు గాను మోహన్‌రెడ్డికి డాక్టరేట్ లభించింది. తన పరిశోధనకు సహకరించిన సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ విశ్వనాథరెడ్డి, డాక్టర్ పి.ప్రేమ్‌చంద్‌బాబు, డాక్టర్ అక్యుటర్‌బాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా మోహన్‌రెడ్డిని పట్టణంలోని పలువురు వైద్యులు అభినందించారు.

ఫార్మకోవిజిలెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



వర్క్‌షాప్‌లో పాల్గొన్న డాక్టర్ చంద్రకళ, జాన్సీ, కళాశాల సిబ్బంది

మార్కాపురం: పట్టణంలోని శామ్యూల్ జార్జి ఫార్మాసూటికల్స్ అండ్ సైన్సెస్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో గురువారం ఫార్మకోవిజిలెన్స్-ఫార్మసీ గ్రాడ్యుయేట్స్ కెరీర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ రెండు వారాల సర్టిఫికేషన్ ప్రోగ్రాంలో ఫార్మసీ విద్యార్థులకు పలు అంశాలపై ఒంగోలు రిమ్స్ ఫార్మా కళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ చంద్రకళ, డాక్టర్ జాన్సీ అవగాహన కల్పించారు. అడ్వాన్స్‌డ్ డ్రగ్ రియాక్షన్(ఏడీఆర్)పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఫార్మకోవిజిలెన్స్ ప్రోగ్రాం ఆఫ్ ఇండియా(పీవీపీఐ) అమలు చేసే విధానం, హీమో విజిలెన్స్, మెటీరియో విజిలెన్స్ తదితర అంశాలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజాజయరావు, అకడమిక్ డీన్ డాక్టర్ వై.సునీత, డాక్టర్ అశోక్, ముజీబ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అయోడిన్‌పై అవగాహన



డిజిటల్ బోర్డును పాఠశాలకు అందిస్తున్న ఐజీడీ సిబ్బంది

మార్కాపురం: ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్(ఐజీడీ) ఆధ్వర్యంలో మండలంలోని రాయవరం జెడ్పీ పాఠశాలలో విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అయోడిన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అయోడిన్ లోపం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యను వివరించారు. పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ బోధనకు అవసరమైన స్మార్ట్‌బోర్డును సంస్థ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది రంగలక్ష్మి, నారాయణమ్మ, దివ్య, అరుణజ్యోతి, రేవతి, పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నెమలిగుండం బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత



మాట్లాడుతున్న సీఐ రామకోటయ్య

రాచర్ల: నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు గిద్దలూరు రూరల్ సీఐ జె.రామకోటయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పి.కోటేశ్వరరావుతో కలిసి విలేకర్ల సమావేశంలో సీఐ మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు 200 మంది ప్రత్యేక పోలీస్ బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాచర్ల నుంచి జేపీ చెరువు మీదుగా ఆలయానికి వచ్చే వాహనాలు, అలాగే గిద్దలూరు నుంచి అంబవరం మీదుగా వచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశామని వివరించారు. పార్కింగ్ స్థలం నుంచి ఆలయానికి చేరుకోవడానికి భక్తులకు ఉచిత ఆటో సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. 13వ తేదీన స్వామి వారి కల్యాణం రోజున మండపం వద్ద బారికేడ్లు, కల్యాణం అనంతరం స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన సత్రాలకు రెండు చొప్పున పాస్‌లు ఇస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు సహకరించాలని కోరారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



విత్తనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

కంభం: పట్టణంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయశాఖ గుంటూరు కమిషనరేట్ నుంచి వచ్చిన అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని ఎరువులు, విత్తనాల స్టాక్ రికార్డులు పరిశీలించారు. దుకాణాల్లో పత్తి విత్తనాల నమూనాలు 14 సేకరించి హెచ్‌టీ టెస్ట్ చేయగా మొత్తం నెగిటివ్‌గా నిర్ధారణ అయ్యాయి. అనధికారికంగా విత్తనాలు విక్రయిస్తున్న డీలర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. తనిఖీల్లో ఏడీఏ బాలాజీ నాయక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.